# నీడ

'జీవితం చాలా విశాలమైంది' అనీ, 'మానవ జీవితం అగాధమైంది' అనీ, ఇలాంటి అద్భుత వాక్యాలతో సాధారణంగా కథలు మొదలవుతూ వుంటాయి. అవి వ్రాసేందుకూ, చదివేందుకూ కూడా బాగుంటాయి.

కాని, ఈ కథ అలా కాదు. ఈ కథ ఎలా మొదలైందయ్యా అంటే:

ఆనాడే నేను ఉద్యోగంలో చేరాను. డిపార్టుమెంటులో స్వంత వూరికి రెండు వందల మైళ్ల దూరం వచ్చాను. ఈ ఉద్యోగం కోసం చదువు పూర్తి చేసుకుని అయిదేళ్లు నిరీక్షించవలసి వచ్చింది. ఈ అయిదేళ్ళలో ఎన్నో ఆశలు, ఆరాటాలు, దెప్పిపొడుపులు,చిన్న చిన్న ప్రయత్నాలు ఆశాభంగాలు, అన్నీ జరిగిపోయాయి. ఉద్యోగంలో చేరిననాడే నా ఉత్సాహం అంతా నీరుకారిపోయింది. ఇంతకాలం నిరీక్షించిన తర్వాత చివరకు ఇలాంటి ఉద్యోగమా అనిపించి డీలా పడిపోయాను. మొదటిరోజు ఆఫీసులో తెలిసిన వివరాలు ప్రకారం జీతం తక్కువ నా ఒక్కడికే ఇంత నగరంలో బొటాబొటీగా సరి పోయేట్టున్నది. పని వరస చూద్దామా బండ చాకిరీ తప్పేట్టులేదు. సరే, ఇవన్నీ అలా వుంచుదాం.

ఆనాడు సాయంకాలం అయిదు గంటలు దాటిన తర్వాత ఆఫీసు ఆవరణలో నుంచి బయటపడి పేవ్‌మెంటు మీద నడుస్తున్నాను. అప్పుడు మొదలైంది ఈ కథ... ఈ వింత కథ...

పేవ్‌మెంట్ మీద జనం రద్దీ ఎక్కువగా వుంది. రోడ్డుమీద వాహనాల రద్దీ మహాజోరుగా వుంది. సహదేవుడి నైపుణ్యం ప్రదర్శిస్తూ జనసమూహాన్ని దాటుకు పోతున్నాను. అంతలో ఎవరో భుజం పట్టుకుని నన్ను ఆపారు. వెనుదిరిగి చూశాను.. ఒక మధ్యవయస్సు వ్యక్తి అదొకరకంగా నవ్వుతూ 'మమ్మల్ని బొత్తిగా మరిచి పోయినట్లున్నారు సార్! ఇన్నాళ్ళు కనిపించనేలేదు' అన్నాడు. నేను కొంచెం ఆశ్చర్యంతో ఏదో చెప్పబోతూ వుండగా చెయ్యెత్తి 'మీరేమీసంజాయిషీ చెప్పనక్కరలేదులెండి. ఇబ్బందులనేవి ఎంతటి వారికైనా వొస్తూవుంటాయి. అదే... ఆరోజు మీరు తెలిసినవారెవరికో యాక్సిడెంటు అయిందనీ అర్జంటుగా కావాలని సొమ్ము పట్టుకుపోయారు చూడండి. దాన్ని గురించి... ఆలస్యమైతే ఫరవాలేదు. మీకు వొచ్చి నప్పుడే యివ్వండి... దాని గురించి కాదు... కనిపించడం మానేశారే అని నా బాధ... వెళ్లొస్తాను...' అన్నాడు. ఆ మాటలు మహాస్పీడుగా అని గబగబ నడిచివెళ్ళి జనంలో కలిసిపోయాడు. నేను ఆశ్చర్యంలోనుంచి తేరుకుని చూసేసరికి ఆ మనిషీ, అతని జాడా కనిపించలేదు.

నేను అలాగే ఒక్కక్షణం నిలబడి చేతి వ్రేళ్ళు విరుచుకున్నాను. అంతలో ఆశ్చర్యం కలిగింది. ఇది మొదటిసారి జీవితంలో నేనిక్కడికి రావడం... ఆ మాటకొస్తే స్వంతవూరు విడిచి ఇంతదూరం రావడమే ఇది మొదటిసారి. అటువంటిది, ఎవరో అపరిచితుడు

పేవ్‌మెంట్ మీద నిలవేసి అలా మాట్లాడితే ఏమిటోగా అనిపించింది. మనసంతా వికృతంగా చికాకుగా తయారైంది. అలాగే రెండు ఫర్లాంగులదూరం నడిచి ఒక కాఫీహోటల్లోకి నడిచాను. అక్కడాఅంతటా రద్దీ... కోలాహలం... కేకలు... గోల... అంతా రణగొణ ధ్వనిగా వుంది. లోపలి గదిలోకి వెళ్ళి కూర్చుని చేత్తో నుదురు రుద్దుకొన్నాను. చప్పుడు చేసన్తా నీళ్ళ గ్లాసులు బల్లమీద ఉంచి "ఏం కావాలిసార్?" అని అడిగిన సర్వరుతో"ఒకకాఫీ"అని చెప్పాను అతడు విసురుగా వెళ్ళిపోయాడు.

అంతలో తలెత్తి చూశాను. "సారీ గురువుగారూ! వెరీసారీ" అంటున్నాడొక యువకుడు. ఆ మాటలని ఎదురుగా కూర్చున్నాడు. కూర్చుని మళ్ళీ "వేరీసారీ.... వెరీసారీ"అన్నాడు. ఆ తర్వాత జేబులోనుంచి కొన్ని నోట్లు తీశాడు. వాటిలోనుంచి ఒక యాభై రూపాయలనోటు ఇవతలికి తీసి మిగిలిన నోట్లు జేబులో ఉంచుకున్నాడు.

'వేరీసారీ'. మీరీమధ్య కనిపించనేలేదు. ఆ రోజూ మీరు సమయానికి అడ్డుపడి ఆస్పత్రికి తీసుకుపోకపోతే ఏమై ఉండేదో ఊహించుకుంటేనే భయంగా ఉంటుంది... మీరీమధ్య కనిపించనేలేదు. ఇవాళే జీతాలిచ్చారు మాకు. ఇది ఉంచండి... ఆలస్యమైంది. ఏమీ అనుకోకండి...కాలు బాగా నయమైంది. బాగానే నడుస్తున్నాను. అర్జంటుగా వెళ్ళాలి. బయట ఫ్రెండ్సు వున్నారు."

ఈ మాటలంటూ అతడు ఆ నోటును నా జేబులో కుక్కి నేను ఏమి చెప్పేందుకూ అవకాశం యివ్వకుండా బాణంలాగా అవతలికి వెళ్ళిపోయాడు. నేను వెంటనే లేచి వెళ్ళి చూద్దునుకదా, హోటలులోనూ, వెలుపలా ఎక్కడా అతడు కనిపించలేదు.

నేను తిరిగి వెళ్ళేసరికి "కాఫీ చెప్పి తెచ్చేసరికి వెళ్ళిపోయారేమిటండీ?" అంటూ సర్వరు కాఫీతో ఎదురైనాడు. కూర్చుని తాపీగా కాఫీ తాగడం ప్రారంభించాను. నోరంతా చేదుగా ఉంది. రాత్రి నిద్రలేక పోవడంవల్ల కళ్ళు మండుతున్నాయి. చొక్కా జేబులో యాభైరూపాయల నోటు ఉంది. బిల్లు తీసుకుని ప్యాంటు జేబులోనుంచి నా డబ్బు తీసి లెక్కపెట్టుకున్నాను. మొత్తం యిరవైరెండు రూపాయిల చిల్లర ఉంది. అపాయింట్‌మెంట్ ఆర్డరు రాగానే నాన్న అప్పటికప్పుడు బయలుదేరి వెళ్ళి ఎవరి దగ్గరో అప్పుగా తీసుకువచ్చి యిచ్చిన యాభై రూపాయలలో మిగిలింది. ఈ డబ్బుతో పదహారు రోజులు గడవాలి అని చింత పీడిస్తున్నది. ఉదయంనుంచీ... ఇప్పుడు అదనంగా యాభై రూపాయలు జేబులో ఉన్నాయి. ఇదంతా బాగానే వుందనిపించింది. అప్రయత్నంగా నోటివెంట ఈల వచ్చింది. దీన్ని గురించి ఎక్కువ ఆలోచించకూడదు-అనుకున్నాను. హోటలు బయటికివచ్చి పక్కనే కిళ్లీకొట్టు ముందు చేతులుకట్టుకుని అనవసరంగా అయిదారు నిమిషాలసేపు నిలబడ్డాను. వొస్తూపోతున్న బస్సులను, కార్లను మోటారు సైకిళ్ళనూ, సైకిళ్ళనూ చూస్తూ.

తర్వాత నేను దిగిన చవకబారు లాడ్జికి వెళ్ళి స్నానంచేసి మంచంమీద మేనువాల్చి కళ్ళుమూసుకున్నాను. అప్పుడు అంతకుముందు జరిగినదంతా నెమ్మదిగా నెమరువేసుకున్నాను. తలచుకుంటే అంతా చిత్రంగా వుంది కాని, అంతా నిజంగా జరిగింది. చొక్కాజేబులో అదనంగా నాది కాని యాభై రూపాయలనోటు కొత్తది అలానే ఉంది. అప్పుడు మెదడులోకి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. 'అవును అలాగే చేద్దాం'

అనుకున్నాను. చూద్దాం ఈ వ్యవహార మేమిటో 'అనుకుని కృత నిశ్చయుణ్ణై తేలికపడ్డ మనసుతో చాలాసేపు చదివిన పేపరే చదువుతూ కూనిరాగాలు తీస్తూ గడిపాను. అంతలో చీకటిపడింది.

గది తలుపుకు తాళంవేసి క్రిందికి దిగి రోడ్డుమీదికి వచ్చాను. చలికాలమేమో రివ్వున గాలి వీస్తున్నది. చల్లనిగాలి బాణ వేగంతో పదునైన బ్లేడుతో కోస్తున్నట్టు వీస్తున్నది. చేతులు రెండూ గుండెల చుట్టూ చుట్టుకొని నెమ్మదిగా నడవడం ప్రారంభించాను. కొంచెం దూరంలోనే చిన్న సెంటరు. అక్కడ 'భోజనము తయారు' అని బోర్డు కనిపించింది, చలికి పళ్ళు టకటకలాడిస్తూ లోపలికి వెళ్ళి కూర్చున్నాను. నల్లని నాపరాళ్లబల్లలు... వాటివెనక కొయ్యబల్లలు... చిన్నదే అయినా పరిసరాలు శుభ్రంగానే ఉన్నాయి. బనీను, లుంగీ మాత్రం ధరించిన సర్వరు వచ్చీ రావడంతోనే ఆకు కడుగుతున్న నన్ను చూసి మొహమింత చేసుకుని నవ్వుతూ నా ముందుకు వచ్చి సంభ్రమంగా "ఏం సార్! ఇన్నాళ్ళు రానేలేదేమిటి? ఊళ్ళో లేరా?" అని పలకరించాడు.

నేను గతుక్కుమని అంతలో సర్దుకుని తలవూపి "లేను" అన్నాను గొణుగుతున్నట్టు.

అతడు వొడ్డిస్తూనే "ఎక్కడికి పోయారు? మీవూరికా?" అని అడిగాడు.

నేను మళ్ళీ తలవూపాను

"ఇవాళ మీ కిష్టమైన కాకరకాయకూర హాయిగా భోం చెయ్యండి. అన్నట్టు ఇన్నాళ్లు మకాం వేశారేం? కొంపదీసి పెళ్ళివ్యవహారం కాదుకదా?"

నేను విస్తరిలో ఉన్న కాకరకాయకూర వంక భయం భయంగా చూశాను. ఒక్క క్షణం-నాకు చిన్నప్పటి నుంచీ కాకరకాయ అంటే అయిష్టమేకాదు అసహ్యంకూడా. కాని అంతలో అతనివంక చూసి నవ్వాను.

అతడు కళ్ళు పెద్దవిచేసుకుని చూసి అంతలో పెద్దగా నవ్వి "అయితే,ఆ శుభకార్యం కాస్తా అయిపోయిందన్నమాట. అమ్మగారిని కూడా తీసుకు వచ్చేశారా? నేనప్పుడే చెప్పాను మీకు. మీరనవసరంగా భయపడ్డారు. ఒకళ్ళనొకళ్ళు ప్రేమించుకున్న తర్వాత ఇక దేన్నీ లెక్కచెయ్యగూడదని చెప్పేవాణ్ణి కదండీ. అన్నట్టు మీరు మీ మాట నిలబెట్టుకోవాలి" అన్నాడు.

నేను కళ్ళు పెద్దవిచేసి ప్రశ్నార్థకంగా అతనివేపు చూశాను.

"చూశారా? అప్పుడే మరచిపోయారు. మీరనుకున్నట్టు అంతా జరిగి మీరు ప్రేమించిన అమ్మాయినే చేసుకోవడం జరిగితే నాకు బక్షీస్ ఇస్తానన్నారు గుర్తులేదూ?"

నేను తలవూపి "అవునవును" అన్నాను.

"సరే... తర్వాత ఇద్దురుగాని... ముందు భోంచెయ్యండి... మరికొంచెం కాకరకాయ కూరవెయ్యనా?"

"వొద్దొద్దు" అన్నాను.

అంతలో అతడు మరొకరికి వడ్డించడానికి వెళ్ళిపోయాడు. నేను నిదానంగా తినడం ప్రారంభించాను. లోలోపల బెంగగా వుంది. భయంగానూ వుంది. భోజనం ముగించే లోపల అతడు నామీద ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు. మళ్ళీ మళ్ళీ కాకరకాయకూర వడ్డించబోయాడు. అతి ప్రయత్నంమీద అతన్ని ఆపగలిగాను. అంతగా ఆకలి లేదన్నాను.

కాకరకాయకూర అద్భుతంగా ఉందన్నాను. ఆ తర్వాత లేచి చెయ్యి కడుక్కుని ఇవతలికి వచ్చేసరికి అతడు నా వెనక నడుస్తూ "అయితే మా హోటలు భోజనానికి స్వస్తి అన్నమాట" అన్నాడు. నేను తలాడించి జేబులో చెయ్యిపెట్టి డబ్బు ఇవతలికి తీశాను. అతడు నవ్వుతూ 'భలేవారండీ... బిల్లు ఇచ్చేయండి చాలు... కౌంటర్లో... నాకు బక్షీస్ ఇవ్వనక్కరలేదు... ఊరికే తమాషాగా గుర్తు చేశాను. అంతే... మీరిప్పటికే మాకెంతో సాయం చేశారు...' అన్నాడు.

నేను ఇవతలికి వస్తుండగా 'మరిచిపోకండీ సార్'... అప్పుడప్పుడు వొస్తూ వుండండి...' అన్నాడు వెనకనుంచి.

నేను మెట్లుదిగి ఇవతలికి వచ్చాను. చలిగాలి ఇంకా పదునుగా వీస్తూనే వుంది. మనసంతా అదొకరకంగా వింతగా ఉంది. కిల్లీకొట్టు దగ్గర ఆగి ఒక సిగరెట్టు కొనుక్కుని కిల్లీ కట్టమన్నాను. కిల్లీ తయారవుతూ వుండగా కూనిరాగంతీస్తూ ఆ కొట్టు ముందే నిలబడ్డాను.

అంతలో నా వెనుక కొద్ది గజాల దూరంలో ఎవరో పెద్దగా 'అదుగో....వాడిలాగే ఉన్నాడురా...' అనడం వినిపించి వెనుదిరిగి చూశాను. అక్కడ మూసి వున్న ఒక షాపు ముందున్న మెట్లమీద కూర్చున్న వ్యక్తి ఒకడు లేచాడు. 'అవును వాడేరా పదండి... దొరికాడు, అన్న మాటలూ వినిపించాయి. మరుక్షణంలో వాళ్ళిద్దరు ముగ్గురు గబగబ నావైపు పరుగెత్తడం ప్రారంభించారు.

నేనింకేమీ ఆలోచించలేదు. బాగా లాగి వొదిలిన బాణం లాగా రివ్వున పరుగెత్తాను. వాళ్ళు రద్దీలో పడి నన్ను అందుకోలేకపోయారు. కాని వెనక పరుగెత్తుకు వొస్తూనే వున్నారు. నేను సందుగొందులు తిరిగి నీడల్లో దాక్కుంటూ దిక్కు తెలియని వాడిలా తచ్చాడుతున్నాను. ఉన్నట్టుండి నేను నిలబడిఉన్న చోటికెదురుగా ఉన్న పెంకుటింటి వాకిలి తెరుచుకుంది. అంతలో పంచలో లైటు వెలిగింది. ఒక పాతికేళ్ళ యువతి నావంక చూసి ఆశ్చర్యంతో 'మీరా?' అన్నది. ఆ తర్వాత నా దగ్గరికివచ్చి చెయ్యిపట్టుకొని పంచలోకి లాక్కుపోయింది. అక్కడ నన్ను నిలబెట్టి 'ఎంతకైనా తగుదురు మీరు. ఇదుగో మళ్ళీ రేపు వస్తానని వెళ్ళి అయిదు నెలలయింది. ఇన్నాళ్ళూ ఎక్కడికి పోయారు? మీకోసం ఎదురుచూడని రోజు లేదు. ఇప్పుడైనా వొచ్చి దొంగలాగా వీధిలో నిలబడడం ఎందుకు? నేను కిటికీలోనుంచి చూశాను కనుక సరిపోయింది లేకపోతే ఆ చలిలో... అవ్వ!' అన్నది.

నేను ఇదీ బాగానే వుందనుకొంటూ పిచ్చినవ్వులు నవ్వుతూ నిలబడ్డాను. ఏమీ మాట్లాడలేదు.

'ఏమీ మాట్లాడరేం? మీ పద్ధతే అంత. చేసేది చేస్తుంటారు. అదేమని అడిగితే బదులు పల్కకుండా ముచ్చులా నిలబడిపోతారు. పదండి లోపలికి. మీపని చెబుతాను. అంటూ నన్ను లోపలికి తోసి తలుపు గడియవేసింది. నన్ను కుర్చీలో కూలేసి లోపలికివెళ్ళింది.

చిన్న యిల్లు అయినా అందంగా, నీటుగా ఉంది. బల్లమీద చిన్న రేడియో, ఫ్లవర్‌వాజూ గోడలమీద ఏవేవో ఫోటోలు... ఇంట్లో ఇంకెవరూ ఉన్నట్టులేరు.

మరునిమిషంలో ఆమె వచ్చింది. చేతిలో చిన్న టిఫినుపళ్ళెం, మరో చేతిలో మంచినీళ్ళగ్లాసు నా ముందు పెట్టింది.

'భోంచేశాను"అన్నాను నసుగుతూ.

"భోంచేశారా?ఎంత ఆశ్చర్యం! ఎనిమిది గంటలకే భోంచేసేంత బుద్ధిమంతు లెప్పుడైనారు? పూటలకు పూటలు ఇల్లు వాకిలీ లేకుండా తిండిమానేసి తిరగడం అలవాటుకదా! అదిఇంతలో ఎలా "మారింది? అంటూ నా జుట్టులోనికి వ్రేళ్ళు పోనిచ్చి మృదువుగా "ఇన్నాళ్ళు శీత కన్నేశారేం? ఊళ్ళో లేరనుకుని సరిపెట్టుకున్నాను మనసుని. పోనీండి. ఇప్పటికైనా నా మీద దయకలిగింది. ఈ మధ్య నాటకాలుకూడా ఎక్కువలేవు... బొత్తిగా యిబ్బందైపోయింది. మీకోసం చాలా ఎదురు చూశాను మీకు తెలుసుకదా? ఎంత నాటకాల మనిషినైనా మిమ్మల్ని తప్ప ఎవ్వరినీ చేరనీయనని?" అంటూ నుదుటిమీద ముద్దుపెట్టుకుంది. అంతలో ఆమె కళ్ళు బరువుగావాలిపోయాయి. బరువుగా నిశ్వసిస్తూ లేచి నా చెయ్యి పట్టుకుని లేవదీసి "రండీ..." అంటూ లోపలికి లాక్కుపోయింది. లోపల మంచంమీదకి తోసింది. తర్వాత లైటు ఆర్పివేసి నావైపు నడిచింది.

తెల్లవారుజామున మెలకువవచ్చి కళ్ళు తెరిచాను. పక్కన ఆమె పడుకుని నిద్రపోతున్నది. నెమ్మదిగా మంచందిగి చొక్కా తొడుక్కున్నాను. మసక వెలుతురులో చేత్తో జుట్టు వెనక్కు దువ్వుకుని చొక్కాజేబులోనుంచి రెండు పదిరూపాయలనోట్లు తీసి దిండు క్రింద వుంచి ఇవతలికి వచ్చాను. ముందుగది గుమ్మంతీసి ఇవతలికి వచ్చి మళ్ళీ తలుపులాగి వరండాలో నిలబడి వీధి చివరి వరకూ చూశాను. పలుచని పొగమంచు... చల్లనిగాలి... ఆకాశంలో వ్యోమ జీవులెవరో పారెసుకున్నట్లున్న మినుకు మినుకు మనే తారలు.

నెమ్మదిగా వీధిలోకి వచ్చి చేతులుకట్టుకుని విసవిస నడవసాగాను. అటుతిరిగి ఇటుతిరిగి నా లాడ్జి కనుక్కునే సరికి తూర్పు తెల్లవారుతున్నది. రూములోకి వెళ్లి మంచంమీద వాలిపోయాను. అంతలో నిద్రపట్టింది. ఆ నిద్రలో కల. పలుచని నీడ ఒకటి అటూఇటూ తిరుగుతూ... రోడ్డు మీద... బస్సు లో... హోటళ్ళలో సినిమాహాళ్ళో... చీకటి సందులలో... పాకలలో... అన్నిచోట్లా ఒకనీడ కనిపించింది. అది మనిషి నీడ.... ఆశ్చర్యమేమిటంటే ఆ నీడ ఎడమచేతికి ఆరువేళ్ళున్నాయి. అయితే ఆరో వేలు చాలా చిన్నది... ఉదయం లేవగానే నా రెండు చేతులవంకా చూసుకున్నాను. నా ఎడమచేతికి అయిదువేళ్ళు ఉన్నాయి.

మరునాడు జాగ్రత్త పడ్డాను. ఆ ప్రాంతాలను పరిహరించి తిరిగాను. మరోవైపు ఎక్కడో దూరంగా ఒకచిన్న గది అద్దెకు తీసుకుని అందులోకి మకాం మార్చాను. ఒకరోజు ప్రశాంతంగా గడిచిపోయింది. దాంతో ఏమీ ఫరవాలేదులెమ్మని ధీమా వచ్చింది. ఆనాడు ఆఫీసు నుంచి ఇవతలికి రాగానే ఊరికే అలా తిరుగుతూ ఊరు చూద్దామనిపించింది, మరికాస్త డబ్బు పంపమని ఇంటికి వ్రాసిన ఉత్తరం పోస్టు చేద్దామని దగ్గరలో ఉన్న పోస్టాఫీసుకు వెళ్ళాను. వరండాలో ఒక పోస్టుమాన్ నన్ను చూసి ఆప్యాయంగా నవ్వుతూ పలకరించి 'ఏమిసార్ ! ఏమైనారిన్నాళ్ళూ? అది ఇటివ్వండి... నేను లోపల పడేస్తాను. అన్నట్టు మీకు రెండు మూడు ఉత్తరాలొచ్చాయి. ఏరీ మీరు లేరుగా? రాకనేపోతిరి... అవి ఉంచే వీలులేదుగా మరి... తిప్పి సెండర్స్‌కే పంపించేశాం...?" అన్నాడు.

నేను తలఊపి ఆ ఉత్తరం అతనికిచ్చి ఇవతలికి వచ్చాను. అలా పార్కుకు వెళ్ళాలనిపించింది. హాయిగా కాస్సేపు కూర్చుంటే బాగుండు ననిపించింది నెమ్మదిగా నడిచి వెళ్ళి పార్కులో బెంచీమీద కూర్చున్నాను. అంతలో ఒక పదేళ్ళ కుర్రవాడు వేరుశనగ కాయలమ్ముకుంటూ వచ్చి 'అరే! మీరా? ఇన్నాళ్ళూ ఇటురానేలేదేమండీ!, అంటూ కాగితంలో వేరుశనక్కాయలు పోసి 'అన్నట్టు ఒక్కరే వొచ్చారేమిటి సార్? అమ్మాయి గారేరీ?' అని అడిగాడు.

నేను గతుక్కుమన్నాను 'ఏఅమ్మాయిగారు?' అని అడిగాను. వివరాలు రాబట్టుకుందామని.

'భలేవారే. నన్నడుగుతున్నారా' అంటూ అదేదో పెద్దజోక్ అయినట్టు వాడు పెద్దగా నవ్వాడు.

సరె... సరే... అంటూ వాడికి డబ్బులిచ్చి పంపించి ఆలోచనలో పడ్డాను. అన్నీ అర్ధం పర్ధంలేని ఆలోచనలు, మనసంతా అయిదు నిముషాలు అస్తవ్యస్తంగా తయారైంది.

విసుగ్గాలేచి బయటపడ్డాను, చీకటి వెలుతురులు చీలికలుగా వ్యాపించివున్న రోడ్డుమీద నడవటం ప్రారంభించాను.

అంతలో వీధి చివర నలుగురు వ్యక్తులు ఎదురైనారు. నా గుండె దడదడ లాడింది. మెరుపులాగా వెనుదిరిగి పరిగెత్తుదామా అన్న ఆలోచన వచ్చింది. కాని నిగ్రహించు కున్నాను. 'ఏమవుతుందో చూద్దాం' అని చిత్రంగా మొండికేసి కదలకుండా నిలబడిపోయాను.

వాళ్ళు నలుగురూ నా దగ్గరికి వచ్చారు. నలుగురూ సంభ్రమంగా నన్ను చుట్టు ముట్టారు. నలుగురూ గొడవ గొడవగా ఒక్కసారే మాట్లాడటం ప్రారంభించారు.

"గురువుగారూ!"

"ఎప్పుడొచ్చారు?"

ఎక్కడికి పోయారిన్నాళ్ళు?

"మమ్మల్ని మరిచేపోయారు"

ఇదీవరస. ఆ హడావిడి తగ్గేవరకూ నేనేమీ మాట్లాడలేదు. తర్వాత నవ్వాను. వాళ్ళూ నవ్వారు. 'పదండిరా. ఇన్నాళ్ళకు మళ్ళీ గురువుగారు దొరికారు. వొదిలి పెట్టకూడదు-పదండి...'

వాళ్ళు దాదాపు నన్ను కౌగిలించుకున్నంత పనిచేశారు. ఆ తర్వాత పొలోమంటూ నన్ను మధ్యలో వుంచుకుని కోలాహలంగా బయలుదేరారు. ఫర్లాంగు దూరంనడిచి ఒక బార్ ముందు ఆగారు. నేను నివ్వెరపోయాను 'ఇదేమిటి'? అన్నాను. 'ఏమీలేదు... కొంచెం... సరదాగా... అంతే పదండి... రండిరా' అన్నాడొకడు. నలుగురూ లోపలికి దూరారు. నేను సంశయిస్తూ వుంటే నన్ను దాదాపు లాక్కుపోయినంత పనిచేశారు నేను గుమ్మం ముందు ఆగి 'ఆగండి' అని అరిచాను. ఆ తర్వాత నెమ్మదిగా నాదగ్గర బొత్తిగా డబ్బులేదు.' అంటున్నాను. అంతలో వారు ఫక్కున నవ్వారు 'అసలు మీదగ్గర ఉంటే మటుకు మిమ్మల్ని పైసాఅయినా ఖర్చు పెట్టనిస్తామా? భలేవారే' అంటూ ఒకడు నన్ను లోపలికి లాక్కుపోయాడు.

లోపల లైట్లు మందంగా వెలుగుతున్నాయి. జనం పలుచగా అక్కడక్కడ కూర్చునివున్నారు. రికార్డు సంగీతం మంద్రంగా, మృదువుగా వినిపిస్తున్నది.

ఒకటేబుల్ ముందు అయిదుగురం కూలబడ్డాం. నన్ను ఒక్క వైపు ప్రత్యేకంగా అధ్యక్షుడిలాగా కూర్చోబెట్టారు. చప్పట్లు కొట్టి హడావిడిగా బేరర్‌ను పిలిచారు. వాళ్ళ హడావుడికి బేరర్ మాత్రమేకాక ప్రొప్రయిటర్ కూడా పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతడు వచ్చీరావడంతోనే 'చూడు ఎవరొచ్చారో' అన్నాడొకడు.

అతడు మొహమంతా నవ్వుపులుముకుని నా ముందుకు వచ్చి 'వూళ్ళో లేరాసార్ ఇన్నాళ్ళు?" అని ఆప్యాయంగా పలకరించాడు. బేరర్లు ఇద్దరు ముగ్గురు వచ్చి నా చుట్టూ నిలబడి నన్నే చూస్తున్నారు.

నిముషంలో సీసాలు వచ్చాయి. సోడాలు వచ్చాయి. గ్లాసులు నిండాయి. నా గుండెలు దడదడలాడాయి. ఇది మొట్టమొదటిసారి నా జీవితంలో దీన్ని తాకడం. వణుకుతున్న చేతితో గ్లాసు అందుకున్నాను. గ్లాసులు ఖణఖణలాడాయి. ఒక్క గుక్క వేశాను. గొంతు మండింది. వగరుగా అరుచిగా వుంది నోరంతా.

ఇంకా పళ్లాలువచ్చాయి. తినుబండారాలు వచ్చాయి...మళ్ళీ సీసాలు వచ్చాయి.

నా కళ్ళముందు అంతా వర్ణమయంగా కనిపించింది. శరీరం తేలికై రెక్కలుకట్టుకుని వ్యోమయానం చేస్తున్నట్టనిపించింది. పంచకళ్యాణి గుర్రం ఎక్కి మైదానాలలో పరుగెత్తుతున్నట్లనిపించింది. "టకటకటక" అద్భుతమైన ధ్వని...

వాళ్ళు మాట్లాడుతూనే వున్నారు. వాటిలో ఒకటే విషయం.

"నేను దేవుణ్ణి... దేవుడి కంటే గొప్పవాణ్ణి."

"నేను లేకపోతే వాళ్ళు నలుగురూ లేరు వాళ్ళ ఫ్యామిలీలూ లేవు"

"వాళ్ళను నేను ఎన్నోసార్లు ఆదుకున్నాను"

నా అంత మంచి మనిషి ప్రపంచంలో ఉండడు - నేను ఇతరుల కోసమే. ఇతరులకు సాయం చేయడానికే పుట్టి జీవిస్తున్నాను'.

'నా మీద ఈగవాలితే వాళ్ళు ఊరుకోరు'

'నా శత్రువులు నన్నేమీ చేయలేరు. వాళ్లను వీళ్లు నల్లుల్లాగా నలిపిపారేస్తారు. నా కోసం తమ ప్రాణాలర్పిస్తారు. నాకోసం కావాలంటే మర్డర్లు చేస్తారు. ఆనందంగా ఉరికంబాలెక్కుతారు.'

నేనన్నిటికీ 'ఊ' కొట్టాను.'సరే సరే' అన్నాను. 'అంతే అంతే. అన్నాను.

రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత బార్‌లోనుంచి ఇవతలికొచ్చాము. బయట అరగంటసేపు మళ్ళీ మళ్ళీ నేనే తమ ప్రాణం అన్నారు. ఒకరి తర్వాత ఒకరు నన్ను కౌగిలించుకున్నారు. చివరకు అతి కష్టంమీద నన్ను రిక్షా ఎక్కించారు. నేను చేయి వూపాను. రిక్షా కదిలింది.

నాలుగోరోజు....అప్పుడే మసక చీకటి పరుచుకుంటున్నది.

ఎందుకైనా మంచిదని మెయిన్‌రోడ్ మీదకాక పక్కరోడ్లమీద నడుస్తున్నాను. ఒకచోట ఎవరో నా చొక్కా లాగినట్లయి వెనుదిరిగి చూశాను.

అయిదేళ్ళ చిన్నపిల్ల, ముద్దుగా బొద్దుగా వుంది. శుభ్రమైన గౌను తొడుక్కుని వుంది. పెద్దపెద్ద కళ్ళు...నవ్వులు కురిసే ముఖం...

"మామయ్యా!" అంటూ చేతులు చాపింది. ఊరికే నవ్వుతున్నది. నాకు మతిపోయినట్లయింది. కాని తమాయించుకున్నాను. ఆ పిల్లను దగ్గరికి తీసుకుని "ఏమిటమ్మా" అని అడిగాను.

"అమ్మ రమ్మంటున్నది" అన్నది చేయిచాపి చూపిస్తూ.

"నేను తల పక్కకు తిప్పి చూశాను. దూరంగా యింటి గుమ్మంలో నిలబడి వున్నారెవరో.

"సరేపద" అంటూ ఆ పిల్లను నడిపించుకుంటూ వెళ్ళాను. నడిసినంతసేపూ వొచ్చీ రాని మాటలతో తియ్యతియ్యని కబుర్లు చెబుతూనే నడిచింది.

ఆమె మేము యింటి ముందుకు రాగానే వెనుదిరిగి లోపలికి వెడుతూ 'ఏమయ్యా యిన్నాళ్ళూ ఎక్కడికి పోయావు? అసలు కనిపించటంలేదేమిటా అని కంగారు పడిపోతున్నాను."అన్నది.

నేనేమీ మాట్లాడకుండా లోపలికి నడిచాను. చిన్న రెండుగదుల పెంకుటింటి వాటా.... ముందుగదిలోకివెళ్ళి నిలబడ్డాను. పసిపిల్ల యింకా ఏదో వాగుతూనే వున్నది. బయట చలికాలపు చీకటి వ్యాపిస్తున్నది. ఎదురుగా గుమ్మం పక్కగా కుట్టుమిషను... పక్కనే టీపాయ్‌మీద ఒక ఫోటో పెండ్లినాటిది...గర్వంగా ఆనందంగా చూస్తున్న వధూవరులు... వారి మెడలోదండలు. ఒక మూల చాప... మరో వైపు చిన్న నవారు మంచం...

అంతలోనే 'నిలబడివున్నావేం?కూర్చో' అంటూ ఆమె వచ్చింది. టిఫిను పళ్ళెం నీళ్ళగ్లాసు టీపాయ్ మీద పెట్టింది. నేను కూర్చున్నాను మంచం చివరగా... 'ఇప్పుడెందుకు!' అన్నాను.

'పిల్లకోసం చేశాను జంతికలు... ఏదో సమయానికి ఉన్నాయి... తిను!... అంటూ ఆమె గోడకానుకుని నిలబడింది. నేను ఫోటో వైపు ఒకసారి ఆమెవైపు ఒకసారి చూశాను. ఆమె ముఖాన బొట్టులేదు. చేతులకు గాజులులేవు... మెడ బోసిగా ఉంది, అంతలో చూపులు తిప్పుకున్నాను.

'అన్నట్టు ఊరికివెళ్ళావా! అసలిటురానే లేదు...పిల్ల కూడా చాలాసార్లు అడిగింది. మామయ్య ఏడీ అంటూ' అన్నది. నేను నీళ్ళు తాగి లేచాను. ఆమె 'అప్పుడప్పుడు వొస్తూవుండునాయనా!నువ్వు చేసిన సహాయానికి రోజూ తలుచుకుంటూ వుంటాను. ఆ కుట్టుమిషను ఆఖరి వాయిదాకూడా కట్టేశాను. ఇక ఇబ్బందులేమీ లేవు... ఏదో యిట్లా రోజులు వెళ్ళిపోతాయిలే... అన్నట్టు ఆనాడు నువ్వు ఈవేళప్పుడే వచ్చి హడావిడిగా వెళ్ళిపోయావ్... అప్పుడు దీన్నిక్కడే మరిచిపోయి వెళ్ళిపోయావు. తీసుకో'అంటూ ఒకడైరీ తెచ్చియిచ్చింది.

నేను దాన్ని అందుకుని పాప బుగ్గలు పుణికి 'వొస్తాను' అంటూ ఇవతలికి వచ్చాను. ఆమె పిల్లనెత్తుకుని గుమ్మంలో నిలబడింది. ఆమె కళ్ళలో నీటిపొర నిలిచినట్టు అనిపించింది.

నేను త్వర త్వరగా రూముకు నడిచాను. నా కంటే ముందు ఎవరిదో నీడ నడుస్తున్నట్టు అనిపించింది. ఎడమచేతికి ఆరువ్రేళ్ళున్ననీడ.

రూములో కూర్చుని ఎంతో ఆత్రుతతో డైరీ తెరిచాను. పేజీలు తిప్పాను.. అంతలో ఎంతో ఆశాభంగమైంది. ఎక్కడా పేరు లేదు. ఊరులేదు. మొదట పేజీలో శ్రీరామ అని మూడుసార్లు వ్రాయబడివుంది. తర్వాత ఎక్కడో ఒక పేజీలో 'మునుస్వామికి అల్యూమినా ప్రెస్క్రయిబ్ చెయ్యాలి...' అని వుంది. తర్వాత ఎక్కడో ఒక పేజీలో ఇవ్వాళ నాటకం చూడాలి. మనసు బాగులేదు. అని ఉంది. తరవాత ఎక్కడ 'చిన్నికి పరీక్ష ఫీజు పంపించాలి.' అని వుంది మరోచోట ఏదో డబ్బులెక్క...అంతే...డైరీ కవరు మడతలో ఒక్క ఆడపిల్ల ఫోటో... పదహారేళ్ళ పడుచుపిల్ల... నవ్వుతున్నది. ఫోటో వెనక అన్నయ్యకు ప్రేమతో...చిన్ని...అని ఆడపిల్ల దస్తూరి...

చివర ఎక్కడో మళ్ళీ డబ్బు లెక్క... అనంతం. సూరి,వెంకులు. అని పేర్లు మాత్రం.... ఇతర వివరాలేమీ లేవు.

పావుగంటసేపు కళ్ళల్లో వత్తులు వేసుకుని చూసి ఆశాభంగంతో దాన్ని పక్కమీద విసిరేసి మంచంమీద పడుకుండిపోయాను. మనసంతా అల్లకల్లోలంగా తుఫాను నాటి సముద్రంలా ఘోరంగా వుంది. లోపల ఏదో దిగులు... గుబులు.

తర్వాత చాలా జాగ్రత్తగా రోజులు గడిపాను. వొళ్ళు దగ్గర పెట్టుకుని నడిచాను. మెయిన్‌రోడ్డు మినహాయించి సందులుగొందులలో తిరిగాను. గడ్డం చేసుకోలేదు వారంరోజులుగా. ఆఫీసులో హెడ్‌క్లర్క్‌ను బతిమాలి, ఆయనకు పళ్ళు ఫలాలూ లంచం ఇచ్చి, ఇంటిదగ్గర దర్శనం చేసుకుని, పనియితే సగం జీతం ఇస్తానని ఆశపెట్టి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం చేశాను. ఈలోపల ప్రతిరోజూ ప్రతిరాత్రీ కలతనిద్రే. నిద్రలో అదే నీడ... దాని ఎడమచేతికి ఆరు వేళ్ళు...

ఆనాడు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వస్తుందని ఆశతో మెయిన్ ఆఫీసుకు వెళ్ళాను. చూడవలసిన వారందరినీ చూశాను. చివరకు సాయంకాలం అయిదింటికి నాపని అయింది. కొండెక్కినంత ఆనందంతో ట్రాన్స్‌ఫర్ ఆర్డరు అందుకుని అందరికీ ధన్యవాదాలు చెప్పి ఇవతలికివచ్చి స్పీడుగా మెట్లు దిగసాగాను. అంతలో పైవరండాలో నుంచి పిలుపువిన వచ్చింది. చివాలున వెనుదిరిగి చూశాను. పైన నిలబడి వుందొక యువతి. గుండెలు దడదడలాడాయి. పరుగెత్తి పారిపోదామా అనిపించింది. కాని అంతలో మళ్ళీ అదే పిలుపు జాలిగా ఆర్ద్రంగా

నేనలాగే నిలబడిపోయాను. ఆమె గబగబ మెట్లుదిగి వచ్చింది. సన్నగా శలాక లాగున్నది. పెద్ద పెద్ద కళ్ళతో అమాయికంగా చూస్తున్నది. ఆకళ్ళలో నీటిపొర తళుక్కుమంటున్నది.

ఆమె నా వంకనే చూస్తూ 'నా పేరు సుజాత...' అలా క్యాంటీన్‌కు వెళ్దాంరండి. అయిదునిమిషాలు. అని ప్రాధేయపడుతూ అడిగింది. ఆమె కళ్ళలో నీళ్ళు.

'ఇదేదో కొత్త గొడవ' అని విసుక్కుంటూ ఆమె వెంట నడిచాను.

క్యాంటీనులో ఎవరూలేరు,మూలగా దారితీసింది. ఇద్దరం కూర్చున్నాం 'ఏం కావాలి?' అని వచ్చిన సర్వరుకు 'ఏమీ అక్కరలేదు! నువ్వు వెళ్ళు' అని చెప్పిందామె.

ఒక్కక్షణం నిశ్శబ్దం నేనా నిశ్శబ్దం భరించలేక నెమ్మదిగా గొణుక్కున్నట్టు 'ఏమండీ!' అని అడిగాను.

ఆమె అంతలో బావురుమన్నది. రెండు చేతులలోనూ మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది. నాకేమి చెయ్యాలో తోచలేదు. ఆదుర్దాగా 'ఏమండీ! ఏమిటిది? యెందుకు? అని మాత్రం అన్నాను.

ఒక్కనిమిషం తర్వాత ఆమె కుదుట పడ్డట్టు కనిపించింది. రుమాలుతో మొహం తుడుచుకున్నది.

తర్వాత ఉన్నట్టుండి నవ్వింది. నల్లని జలార్ద్రమైన మబ్బులను చీల్చుకుని మెరుపుతీగ మెరిసినట్టు.

ఆమె చూపులు బల్లమీద ఉన్న నా చేతులమీద ఉన్నాయి. నేను స్థాణువులా కూర్చుండిపోయాను.

అంతలో 'విచిత్రం' అన్నదామె.

"ఏమిటి"అన్నాను నేను. అంతలో పార్కులో వేరుశనగ కాయలమ్ముకునే కుర్రవాడి మాటలు గుర్తుకొచ్చాయి. అమ్మాయిగారేరి? అని అడిగాడు వాడు. 'అమ్మాయి గారు ఈవిడేనేమో? నాలో ఉత్కంఠ పెరిగింది.

ఉన్నట్టుండి అన్నాను "నేను ఇటీవలే ఇక్కడికి ఉద్యోగరీత్యా వచ్చాను. మా వూరు చాలాదూరం...'

'ఈ ఆఫీసులో పని వుండి వొచ్చాను నేనూ... ట్రాన్స్‌ఫర్ కోసం... ఉదయం నించీ చూస్తున్నాను మిమ్మల్ని, ఎందుకొచ్చారు? అని అడిగింది. చెప్పాను.

'ఎందుకు వెళ్ళిపోతున్నారు?" అని అడిగింది.

అప్పుడు నా బాధ దాచుకోలేకపోయాను. మొత్తం విషయం అంతా విడమరిచి చెప్పాను. ఏమీ దాచుకోకుండా చెప్పాను. నా కలలో నీడ గురించి కూడా చెప్పాను.

ఆమె అంతా ఆశ్చర్యంతో విన్నది. ఉత్కంఠతో విన్నది. ఆ తర్వాత నిట్టూర్చింది.

ఉన్నట్టుండి 'అవును మీరు వెళ్ళిపోవడమే మంచిది' అన్నది.

'గుడ్‌లక్...అండ్ గుడ్‌బై' అంటూ లేచింది.

'ఇంతకూ మీరు నన్నెందుకు పిలిచారు'? అన్నాను నేను లేస్తూ.

ఆమె వెనుదిరిగి 'అవును, మీకు చెప్పనే లేదు. అతని పేరు రాజు... వరదరాజు... నన్ను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాడు. అతని వివరాలేమీ నాకు తెలియవు"అంటూ ఆగిపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"ఏమయింది?" అని అడిగాను నేను.

ఆమె గొంతు సవరించుకుంది. "చచ్చిపోయాడు"అన్నది. 'నాకళ్ళ ముందే.... నా వొడిలోనే... ఇద్దరం మోటారు సైకిల్ మీద షికారు వెళ్ళాము. ఇరవై మైళ్ళ దూరం వేగంగా వెళ్ళాం. అద్భుతంగా వెళ్ళాం. కానీ వచ్చేటప్పుడు చీకట్లో జరిగింది ప్రమాదం. పడిపోయిన అయిదు నిమిషాల్లో అంతా అయిపోయింది. ఆ తర్వాత నేను మా ఊరు వెళ్ళిపోయాను. ఇప్పుడు ట్రాన్స్‌ఫర్‌కోసం వచ్చాను".

ఆమె ఒక్క క్షణం నావంక కన్నార్పకుండా చూసి 'అతని ఎడమచేతికి ఆరువేళ్ళుంటాయి. ఆరోవేలుచిన్నది...' అని చెప్పింది. ఆ తర్వాత 'క్షమించండి... వొస్తాను' అంటూ వెళ్ళిపోయింది.

నేను ఒక క్షణం అప్రతిభుడనై నిలబడి ఆ తర్వాత తేరుకుని ఇవతలికి వచ్చాను. ఆ రోజు రైల్లో అద్భుతంగా నిద్ర పట్టింది. నిద్రలో కలలేరా లేదు.

◆ ◆ ◆